ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 21 ఆగస్టు 2024





● సిమెంటు రాళ్లతో నిర్మించిన ఇళ్ల గోడలు

తెనాలిలో అడుగు లోతులోని పిల్లర్లపై లబ్ధిదారుల ఫిర్యాదుతో పీకేసిన అధికారులు →



కూలుతున్నా.. కట్టాలంట

- జగనన్న కాలనీ ఇళ్లలో అక్రమాలు
- పిచ్చుక గూళ్లులా కట్టినోళ్లకే మళ్లీ కాంట్రాక్టు
- ప్రభుత్వం మారినా వైసీపీ వారే నిర్మాణదారులు
- వంద రోజుల ప్రణాళిక అని అధికారుల హడావుడి
- గృహ నిర్మాణ శాఖకు బకాయిలున్నా వారికే పనులు
- రికవరీకి జప్తు నోటీసు లిచ్చి.. మళ్లీ పనులు అప్పగించిన వైనం

ఇల్లు.. పేదల నుంచి ధనవంతుల వరకు కల. ఎవరి స్థాయిలో వారు పది కాలాలు ఉండేలా నిర్మించుకుంటారు. అలాంటి ఇళ్ల నిర్మాణాలను గత ప్రభు త్వం అపహాస్యం చేసింది. రూ.కోట్లు దోచుకు నేందుకన్నట్లుగా నిర్మాణాలు చేపట్టారు. జగనన్న కాలనీల పేరుతో పేదల సొంతింట కల నెర వేరుస్తున్నామంటూ దోపిడీకి వైసీపీ నాయకులు తెర లేపగా వారికి కొందరు అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. జగనన్న కాలనీల్లో పేదల కోసం ఆప్షన్ -3లో నిర్మిస్తున్న ఇళ్లు పిచుక గూళ్లుగా ఉన్నాయి. మూడడుగుల లోతులో వేసిన పిల్లర్లు.. నేలపైనే పునాదులు.. నిర్మాణం జరుగుతుండగానే పగుళ్లిస్తూ ఒరిగిపోతున్న గోడలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల పరిస్థితి. అయితే ప్రభుత్వం మారింది ఇలాంటి అక్రమాలు ఇక ఆగిపోతాయని లబ్ధిదారులు భావించగా అధికారుల తీరు వారిని నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నాటి వైసీపీ కాంట్రాక్టర్లకే మళ్లీ పనులు అప్పగిస్తూ నిర్మాణాలపై అధికారులు హడావుడి చేస్తున్నారు. వైసీపీ హయాంలో జగనన్న ఇళ్లలో జరుగుతున్న అక్రమాలపై ఆందోళన చేసిన టీడీపీ నేతలు ప్రస్తుతం మౌనం దాల్చడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెనాలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పది కాలాలు ఉండాల్సిన ఇళ్లు నిర్మాణదాశలోనే కూలుతున్నాయి. గోడలు ఒరిగిపోతు న్నాయి. అయినా ఇంకెవరూ జగనన్న ఇళ్లు కట్ట లేరన్నట్లుగా.. తిరిగి వారికే కూటమి ప్రభుత్వంలోనూ అధికారులు పనులు అప్పగిస్తున్నారు. ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్ ముసుగులో వైసీపీ నేతలు కట్టిన పేదల ఇళ్లలో నాణ్యతా లోపాలు కంటికి కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ కాంట్రాక్టర్ ముసుగు వేసుకున్న వారు మాత్రం మారలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ నేతలకే ఇళ్ల నిర్మాణ పనులు అప్పగిస్తున్నారు. 100 రోజుల ప్రణాళిక అనిచెప్పి అధికారులు హడావుడి చేసేస్తూ వారినే ఇళ్లు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిం చాయని నాడు గగ్గోలు పెట్టిన కూటమి నేతలు కూడా ఇపు డు పెదవి మెదపడంలేదు. అనుభవం లేకున్నా.. అధికారులు వైసీపీ కాంట్రాక్టర్లకే ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిష్టర్డు కాంట్రాక్టర్లా అంటే అదీ కాదు.. అయినా ఇంకెవరూ లేరన్నట్లుగా వైసీపీ వారే దిక్కనట్లుగా ఇళ్ల పనులు ఇచ్చారు. జగనన్న కాలనీల్లో గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొదటి విడతలోనే భారీ అక్రమాలు జరిగాయని లబ్ధిదారుల నుంచి నాటి కూటమి నేతల వరకు ఆరోపణ. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు న్నాయని, నిర్మాణం కోసం ఇచ్చిన ఇనుము, సిమెంట్‌లను కొందరు కాంట్రాక్టర్లు అమ్మేసుకున్నారనే విషయాలపై గతంలోనే ఆధారాలతో నేతలే బయటపెట్టారు.

అప్పనంగా అప్పగించేశారు..

జగనన్న కాలనీల స్థలాలు కొనే విషయంలో ఎమ్మెల్యే స్థాయి వారికి భారీ లబ్ధి చేకూర్చిన అప్పటి వైసీపీ సర్కారు, ఇళ్ల నిర్మాణంలోనూ కిందిస్థాయి నాయకులకు లబ్ధి కలిగేలా అర్హతా లేని వారికి పనులు అప్పగించారు. అడ్వాన్స్‌ల రపంలో తొలి దోపిడీకి తెరతీస్తే, తర్వాత ఇంటి నిర్మాణానికి ఇచ్చిన ఇనుము, సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించి కొందరు అమ్మేసుకున్నారు. 12 అడుగుల లోతులో పిల్లర్లు నిర్మించాని గృహనిర్మాణ శాఖ సూచిస్తే, చాలాచోట్ల 3 నుంచి 6 అడుగుల లోతులో గోతులు మాత్రమే తీసి పిల్లర్లు వేశారు. కొన్నిచోట్లయితే కేవలం అడుగు లోతులోనే పిల్లర్లు వేశారు. ఇటువంటి వాటిని తెనాలి, గుంటూరు, పొన్నూరు, బాపట్లలో కొందరు సి బ్బంది గుర్తించి వాటిని తిరిగి నిబంధనల ప్రకారం నిర్మించాలని కోరితే వైసీపీ కాంట్రాక్టర్లు వారి మాటలు పట్టించు కోలేదు. ఎవరైనా గట్టిగా అడిగితే వారిపై దౌర్జన్యం చేసిన సందర్భాలున్నాయి. తెనాలి వంటిచోట్లయితే కొందరు అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోపిడీకి దారులు చూపించారు. మరికొందరు వారి బంధువులనే కాంట్రాక్టర్లుగా రంగంలోకి దించి నిధులు దోచేశారు. పేరేచర్ల, బాపట్ల, మరికొన్ని చోట్లయితే నిర్మాణం పూర్తయిన ఇళ్లు కూలిపోవడం, గోడలు పడిపోవటం వంటివి అప్పుడే బయటపడ్డాయి. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, మంగళగిరి నియోజకవర్గాల పరిధిలో చాలా లేఅవుట్లలోగోడలకు పగుళ్లిచ్చాయి. దారుణంగా ఇళ్ల నిర్మాణాలు చేసినా, రూ.కోట్లలో నిధులు దోచేసినా వారికే మళ్లీ పనులు అప్పగించడం చూస్తే దొంగ చేతికే తాళాలు ఇచ్చిన చందంగా అధికారుల తీరు ఉందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నాసిరకం పనులపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసిన కాంట్రాక్టర్లకే కూటమి ప్రభుత్వంలోనూ పనులు ఇస్తున్నారంటూ వాపోతున్నారు. ఇటీవల తెనాలిలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి, వాటి పురోగతిని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా పాలనాధికారే పనులను పాత కాంట్రాక్టర్లతో చేయించాలని ఆదేశాలివ్వడం విమర్శలకు తావిస్తోంది. ఓపక్క రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి లేఔట్‌లలో ఇళ్లను పరిశీలించి ఐదుగురు కాంట్రాక్టర్‌ల నుంచి వెంటనే డబ్బు రికవరీ చేయాలని, ఒక కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే 100 రోజుల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యం పెట్టుకోవటం వల్లే వారికి పనులు అప్పగిస్తున్నావమని కొందరు అధికారులు చెబుతున్నారు.




పనుల కంటే అడ్వాన్సులే అధికం..

ప్రభుత్వం వారిది.. కాంట్రాక్టర్లు వారే కావడంతో వారు ఏదడిగితే అదిచ్చేయటం, వారు ఎలా నిర్మించినా బిల్లులపై సంతకాలు చేయమంటే చేసేయడం గృహనిర్మాణ, మెప్మా అధికారుల వంతైంది. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరయితే, వీటిలో కేంద్రం రూ.1.5 లక్షలు విడుదల చేస్తే, మిగిలిన రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వం వాటాకింద ఇవ్వాలి. కానీ ప్రభుత్వం దిగిపోయే వరకు ఆ వాటా మొత్తాన్ని విడుదల చేసే విషయాన్ని విదిలింపులతోనే సరిపెట్టారు. పైగా మెప్మా ద్వారా ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణం ఇప్పించి వారితో కట్టించారు. కనీసం లబ్ధిదారులు భరిస్తున్న మొత్తాలు కూడా ఇవ్వలేదు. పునాదులు వేస్తే ఇంటికి రూ.70 వేల చొప్పున అప్పనంగా వారి చేతిలో పెట్టేశారు. ఇవికాక మెప్మా రుణం మొత్తాన్ని లబ్ధిదారుల అంగీకారంతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల ఖాతాలకు మళ్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా ఏ అధికారీ అడ్డుకోలేదు. దీంతో ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల నుంచి 10 కోట్ల వరకు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేశారు. ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే కేవలం ఐదుగురు కాంట్రాక్టర్లకు రూ.9 కోట్ల వరకు ఇచ్చేశారు. అయితే వీరికి ఇవ్వాల్సిన బిల్లులు తీసేస్తే ఇంకా నేటికీ కాంట్రాక్టర్లే ప్రభుత్వానికి రూ.6.21 కోట్లు చెల్లించాలి. ఇదే తరహాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ వైసీపీ ఎమ్మెల్యేకి సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థ రూ.70 కోట్లపైన తిరిగి చెల్లించాలి. ఈ మూడు జిల్లాల్లోనే రూ.89 కోట్లకు పైనే కాంట్రాక్టర్ల నుంచి బకాయిలు రావాల్సి ఉందనేది ప్రాథమిక అంచనా. అయితే వీరందరికీ జూలై మొదటి వారంలోనే గృహనిర్మాణ శాఖ నోటీసులు జారీ చేసింది. ఎన్ని ఇళ్ల నిర్మాణానికి తీసుకున్నారో! వాటిలో ఎన్ని నిర్మించారో, వాటికోసం ఎంత డబ్బు అడ్వాన్స్ కింద తీసుకున్నారో వివరాలు తెలియచేస్తూ కాంట్రాక్టర్‌లకు నోటీసులిచ్చారు. నోటీసు అందుకున్న 15 రోజుల్లోగా మెప్మాకు, గృహ నిర్మాణ సంస్థకు బాకీ ఉన్న మొత్తాలను ఆయా ప్రభుత్వ ఖాతాలకు జమ చేయాలని నోటీసుల సారాంశం. అయితే వీటికి ఎవరూ స్పందించకపోవడంతో తాజాగా ఆస్తుల జప్తు చేస్తుమంటూ మరో నోటీసుకూడా కొన్నిచోట్ల అందించారు. కొందరు భయపడి చెల్లించడానికి ముందుకు వస్తే, చాలామంది ఏ సమాధానం లేకుండా ఉండిపోయారు. వీరిలో కొందరు మాత్రం తమకే ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉందని, వాటి విషయం తేల్చకుండా డబ్బు చెల్లించమంటే ఎలాగంటూ ఎదురుతిరిగారు.



తక్కువ ఎత్తులో పిల్లర్లతో పునాదులకే పరిమితమైన ఇళ్లు



సీఆర్‌డీఏ సమర్థంగా

- విభాగాల వారీగా బలోపేతానికి అడుగులు
- అమరావతి పనులు ముమ్మరం చేసేలా పోస్టింగ్‌లు
- రెవెన్యూ విభాగానికి 23 మంది తహసీల్దార్ల డిప్యూటేషన్
- ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర విభాగాల పటిష్టతకు చర్యలు
- ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఎంబీఏ రంగాల వారికీ అవకాశం

విజయవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతిలో పనులు ముమ్మరం చేసేలా సీఆర్‌డీఏ శరవేగంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలకు.. ఆలోచనలకు అనుగుణంగా అమరావతిలో వివిధ ప్రాజెక్టులపై రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) దృష్టి సారించింది. ఈ క్రమంలో సమర్థంగా పని చేసేందుకు సీఆర్‌డీఏ తొలుత పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని పనులను ముమ్మరం చేసేందుకు సిద్ధమౌతున్న సీఆర్‌డీఏకు తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో భూ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించడం కష్టమైపోతోంది. ఒక్క రెవెన్యూ విభాగమే కాకుండా ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర ఇతర విభాగాలలో కూడా సీఆర్‌డీఏలో తగినంతమంది సిబ్బంది లేరు. ఈ పరిస్థితుల్లో సీఆర్‌డీఏలో వివిధ విభాగాలతో పాటు రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లను డిప్యూటేషన్ పద్ధతిలో పోస్టింగ్‌లు కల్పించింది. రాజధాని పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాకు చెందిన మొత్తం 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ కల్పించింది. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న 188 మందిని డిప్యూటేషన్‌పై తీసుకుంటామని జూలైలో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు రావడానికి ఏ శాఖ నుంచి కూడా ఇష్టపడలేదు. ఈ విషయాన్ని సీఆర్‌డీఏ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులే నేరుగా రంగంలోకి దిగి తమ పరిధిలో ఉన్న అధికారులను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ విధానంలో పంపిస్తున్నారు. మొదటిగా సీసీఎల్ఏ దీనికి పూనుకుంది. సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మి 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 23 మంది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సీఆర్‌డీఏకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. వీరే కాకుండా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలోనే 20 మంది అవసరం ఉంది. సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ మీద వస్తున్న తహసీల్దార్లు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ల్యాండ్ యూజ్ మేనేజర్లు, ఎస్టేటు మేనేజ్‌మెంట్, ఎస్టేటు ల్యాండ్ ఎక్విజిషన్, ల్యాండ్ ప్రొటెక్షన్, రెవెన్యూ ఆఫీసర్స్ వంటి స్థానాల్లో పనిచేస్తారు. వీరికింద పనిచేసేలా డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇస్తారు. ల్యాండ్స్ డైరెక్టర్లుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలో తీసుకుంటారు. వీరికి సంబంధించి ఇంకా ఆదేశాలు రాలేదు. ఆర్డీవో, డీఆర్వోల స్థాయిలో ఉన్నవారిని తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలను కూడా సిబ్బందితో భర్తీ చేయాల్సి ఉన్నందున ఆయా శాఖలకు సంబంధించి ఇంకా డిప్యూటేషన్ ఖరారు కాలేదు.

పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..

సీఆర్‌డీఏలో కాంట్రాక్టు విధానంలో పలు పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేశారు. డైరెక్టర్ (ప్లానింగ్), చీఫ్ ఇంజనీర్(ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్), గ్రూప్ డైరెక్టర్(సోషల్ డెవలప్‌మెం ట్), మేనేజర్(మీడియా),జాయింట్ డైరెక్టర్ (స్ట్రాటజీ), డిప్యూటీ డైరెక్టర్(ఫైనాన్షియల్ ప్లా నింగ్ స్ట్రాటజీ డివిజన్) పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం ఈ దిశగా ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడుతోంది. సీఆర్‌డీలో వర్ధమాన పట్టభద్రులను దృష్టిలో ఉంచుకుని 9 ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. అడిషనల్ డైరెక్టర్ - ప్రొక్యూర్‌మెంట్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ మేనేజర్ - ప్రొక్యూర్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), జాయింట్ డెరెక్టర్ - ఎకనామిక్(ఎంబీఏ), ఎన్విరాన్‌మెంటలిస్ట్(ఎమ్మెస్సీ), సీనియర్ కన్సల్‌టెంట్ - క్వాలిటీ కంట్రోల్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ కన్సల్‌టెంట్ - ఇన్ఫ్రా మేనేజ్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ అర్బన్ ప్లానర్ - ఆర్కిటెక్ట్(ఆర్కిటెక్చర్), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్ ఇంజనీరింగ్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు సీఆర్‌డీఏ వెబ్‌పోర్టల్‌లో కెరీర్స్‌లోకి వెళ్లి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే అందులోనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి

● జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు





మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

బాపట్ల, ఆగస్టు 20: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్ఎమ్ఈ వ్యవస్థాపకత, ఆహార శుద్ధి పరిశ్రమల విధానం రూపకల్పనకు సూచనలు, సలహాలపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆక్వాకల్చర్, గ్రానైట్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల పెంపకం- శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనువైన ప్రాంతమన్నారు. రాయల్‌మెరైన్ ప్రతినిధి సి.వి జయ్‌కుమార్ మాట్లాడుతూ మెరైన్ పరిశ్రమలు స్థాప నకు 40 అడుగుల రోడ్డు నిబంధనను సడలించాలని, కరెంట్‌కోతలు లేకుండా చూడాలన్నారు. ఫ్యాపిసియా తరఫున హాజరైన కె.సుబ్బారావు మాట్లాడుతూ ఈవోడీబీ నిర్దేశించిన రిఫార్మ్‌ను సరళతరం చేస్తూ కొన్ని రకాల అనుమతులను ఎత్తివేయాలని తెలిపారు. చీరాల ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధి ఎం.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎపిక్ ద్వారా స్థలం కొనుగోలు చేసిన బీసీ మహిళలకు కూడా రాయితీ ఇవ్వాలన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.శిరీషా మాట్లాడుతూ మిల్లులకు ప్రత్యేక రాయితీ ఇవ్వాలన్నారు. మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఇంటూరి ఆంజనేయులు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలకు ట్రూ ఆఫ్ చార్జీలు ఎత్తివేయాలన్నారు. పరిశ్రమ స్థాపించి ఏడేళ్లు దాటిన వారికి మర లా కొత్త యంత్రాలు ఏర్పాటు చేస్తూ కొత్తగా రాయితీలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వై.రామకృష్ణ, ఆర్డీవో లు, ఈఈలు, ఎల్‌డీఎమ్‌లు, డీపీవోలు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

ఇనాం సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జేసీ బి.సుబ్బారావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్డీవో లు, తహసీల్దార్‌లతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 4 ఈనాం ఎస్టేట్ గ్రామాలు, మూడు ఇనాం గ్రామాల్లో భూ సమస్యలు వివిధ దశల్లో అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మార్టూరు మండలంలో లక్కవరం, జంగమహేశ్వరపురం, పర్చూరు మండలలో ఎడుబాడు, సంతమాగులూరు మండలంలో గోపాపురం గ్రామాలో ఎస్టేట్ భూములు ఉన్నాయని తెలిపారు. భూ సమస్యల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా చూచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో గంధం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన.. నివాళి

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ హాస్పిటల్ ఘటనకు నిరసనగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(అబ్జుడా) ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో నిరసన కొనసాగింది. సాయంత్రం ప్రదర్శనగా గుంట గ్రౌండ్‌కు చేరి ట్రైనీ పీజీ చిత్రంపై కొవ్వొత్తులతో నివాళులర్పించారు. - గుంటూరు (మెడికల్)

సర్దుబాటు గందరగోళం

- హైస్కూళ్లలో ఎస్ఏలకు బదులు ఎస్‌జీటీలు..
- పలు పాఠశాలల్లో తీరని సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత
- జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీలకు నియామకాలు
- సంఘాల విజ్ఞప్తుల్ని బుట్టదాఖలు చేశారని ఆందోళన
- గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే జరిగిన వాటికి తిలోదకాలు

గుంటూరు(విద్య), ఆగస్టు 20: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రారంభమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రి య అనేక చోట్ల గందరగోళంగా మొద లైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో మంగళవారం నుంచి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రారంభమైం ది. మండల స్థాయిలోని పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేసేలా ఎంఈవోలు కౌన్సెలింగ్ ప్రకియ నిర్వహించారు. అయితే ఇదీ అనేక ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా సాగినట్లు సంఘాల నాయకులు, కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల మెరిట్ కం రోస్టర్ పాటించలేదని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో జూనియర్లకు ఒక న్యాయం సీనియర్లకు మరో న్యాయం జరిగినట్లపోయారన్నారు. ఎస్‌జీటీ సీనియార్టీ జాబితాను విడుదల చేయలేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

● గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు నెల క్రితమే ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే అదనపు ఉపాధ్యాయుల్ని 5 నుంచి 15 మంది వరకు సర్దుబాటు చేశారు. తాజా గా మరోసారి సర్దుబాటుతో మళ్లీ వారితో బోధన చేయించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని హెచ్‌ఎంలు వా పోతున్నారు.

● పల్నాడు జిల్లా రాజుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఇద్దరు ఎస్‌జీటీలను సర్ ప్లస్ పేరుతో బయటకు పం పారు. ఇక్కడ స్కూల్ అసిస్టెంట్స్ స్థానంలో ముగ్గురు ఎస్‌జీటీలను నియమించారు.

● గుంటూరు పశ్చిమ మండలం నల్లపాడు జడ్పీ స్కూల్ నుంచి గుంటూరు తూర్పు మండలం ఏటుకూరులో స్కూల్‌లో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు.

● మాచర్లలో సీనియర్ ఉపాధ్యాయుల నుంచి విల్లింగ్(అనుమతి) తీసుకోకుండా, అదనంగా ఉన్న జూనియర్ టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు.

● అనేక స్కూల్స్‌లో ఒక సబ్జెక్టు బదులు మరో సబ్జెక్టు ఉపాధ్యాయుల్ని నియమించారు. దీనివల్ల కొరత తీరినా సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● గత ఐదేళ్లుగా మున్సిపాల్టీల్లో, కార్పొరేషన్ పరిధిలో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించలేదు. అదేమని ప్రశ్నిస్తే రూల్స్‌లేవని అధికారులు సమాధానం చెబుతున్నారు. అయితే జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీల్లోని పాఠశాలలకు, మున్సిపల్ స్కూల్స్ నుంచి జడ్పీ స్కూల్స్ ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేస్తున్నారు. ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించినా సమాధానం లేదని సంఘాల నాయకులు వాపోతున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో ఐటీ సెల్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సర్దుబాటు జరు గుతుందని ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.



సర్దుబాటు కోసం ఎమ్మార్సీకి వచ్చిన ఉపాధ్యాయులు

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BYXem1hలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Alstom India

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.
- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time) ***Last Date to Apply:*** 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Legrand Empowering

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.
- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.
- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు



ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.

అందరికీ ధన్యవాదాలు



తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

- షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.
- ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం... అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.
- షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటి స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

- కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.
- అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.

ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలి

రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకొని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవ కుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. అమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!



పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!

నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.

అసూయతో వచ్చిన మాటలవి





ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..

విడుదల తేదీ మారింది



వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తన కంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మెట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

ప్రజాదర్బార్‌కు వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

● సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: మంత్రి లోకేశ్



దివ్యాంగుల సమస్యలు వింటూ భరోసా ఇస్తున్న లోకేశ్

తాడేపల్లి టౌన్, ఆగస్టు 20: భూవివాదాలపై ప్రజల నుండి ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నందున ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉండవల్లి లోని నివాసంలో 28వ రోజు మంగళవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. ఆయా విజ్ఞప్తులను పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణం కోసం పెదవడ్లపూడికి చెందిన 40మంది వృద్ధులు కలిసి సేకరించిన రూ.28వేల విరాళాన్ని ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి అభినందనలు తెలిపారు.

మంగళగిరి నియోజకవర్గం నుండి వచ్చిన విన్నపాలు ...

మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన రైతులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. వైసీపీ అండతో గ్రామంలోని ఉప్పల పాటి చెరువు కట్టను కొంతమంది ఆక్రమించారని, దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. పెదవడ్లపూడిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న 40 ఎకరాల రైతు పట్టా భూములను 2010లో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రికార్డులు పరిశీలించి 22-ఎ నుండి తమ భూములు తొలగించాలని గ్రామానికి చెందిన బాధిత రైతులు కోరారు. దివ్యాంగుడనైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన షేక్ మౌలాలి విజ్ఞప్తి చేశారు. చిట్యాల ఐలమ్మ రజక ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని ఉండవల్లి గ్రామానికి చెందిన రజక సోదరులు కోరారు. బీకామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దుగ్గిరాలకు చెందిన చల్లపల్లి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు...

నెల్లూరు జిల్లా సైదాపురం రెవెన్యూ పరిధిలో వంశపారంపర్యంగా వచ్చిన తన రెండెకరాల భూమిని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అండతో కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన రావిళ్ల శ్రీనివాసనాయుడు విజ్ఞప్తి చేశారు. పోలియో వ్యాధి బారినపడి మంచానికే పరిమితమైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఎం మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు. పుట్టుకతో దీర్ఘకాలం చర్మవ్యాధి బారినపడిన తమ కుమారుడికి పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మద్దిగుంట జగదీష్ చంద్రప్రసాద్ కోరారు. చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన యూనియన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు ఆదేశాలు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం సేకరించిన తన 18 సెంట్ల స్థలానికి నష్టపరిహారం చెల్లించలేదని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన కళ్లేపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. అనియత విద్య బోధక, పర్యవేక్షకులకు అర్హతను బట్టి వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో నియమించాలని నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్స్ అండ్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న బీఈడీ, రికార్డు ఫీజులు తగ్గించాలని ఎస్ఎస్‌యూఐ ప్రతినిధులు కోరారు. పార్ట్‌టైం జాబ్ ఆశచూపి నకిలీ బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.16లక్షల వరకు సైబర్ నేరానికి పాల్పడ్డారని విచారించి తగిన న్యాయం చేయాలని తిరుపతి జిల్లా కామకూరుకు చెందిన వీ గురేష్ కోరారు. కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్య సాయం నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తిరిగి మంజూరు చేయాలని కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన గొల్లమందల శ్రీను కోరారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్ట్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

అమ్మనందుకు ఆక్రమించారు

● న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే నరేంద్రవర్మను కోరిన బాధిత మహిళ

● న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత మహిళ రహంతున్నీసా

బాపట్ల, ఆగస్టు 20: ఎంతో విలువైన తన భూమిని అమ్మాలని వచ్చిన వారిని నిరాకరించినందుకు వైసీపీ శ్రేణులు సర్వే నెంబరు మార్చి 19 సెంట్ల భూమి ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధిత మహిళ రహంతున్నీసా మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. తన తల్లి పసుపుకుంకుమ కింద తనకు 50 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, సదరు భూమిపై కన్నేసిన వైసీపీ నాయకులు నాగరాజు, రాఘవరెడ్డి, చెన్నకేశవరెడ్డిలు పొలం అమ్మాలని అడిగితే నిరాకరించినందుకు 19 సెంట్ల భూమిని ఆక్రమించి నరసరావుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఎమ్మెల్యేకు వివరించింది. తన భూమి తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరింది. దీనిపై ఎమ్మెల్యే నరేంద్రవర్మ స్పందిస్తూ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తగిన న్యాయం చేస్తామని హామినిచ్చారు. వైసీపీ పాలనలో ఐదారుగురు భూ కబ్జాలకు పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్నీ బయటకు తీసి నష్టపోయినవారికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. సూర్యలంకరోడ్డులోని బ్లూప్లేట్ హోటల్ దగ్గర 19 సెంట్ల భూమిని ఆక్రమించినవారికి శిక్షపడేలా చూస్తామన్నారు. భూమిని తిరిగి ఇప్పిస్తామని హామీనిచ్చారు. ఈ విషయంలో ఏ ఒక్కరికి నష్టం జరగకుండా ఆక్రమించిన భూములన్నీ వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

తెనాలిలో నిహారిక సందడి

● కమిటీ కుర్రోళ్లు చిత్ర యూనిట్ సందర్శన



ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న నిహారిక

తెనాలి అర్బన్, ఆగస్టు 20: సినీ నిర్మాత, నటి కొణిదల నిహారిక మంగళవారం తెనాలిలో సందడి చేశారు. ఆమె నిర్మాతగా తీసిన సినిమా కమిటీ కుర్రోళ్ల ప్రదర్శిస్తున్న తెనాలి ప్రియ థియేటర్‌కు చిత్ర యూనిట్‌తో కలిసివచ్చారు. అప్పటివరకు సినిమా చూస్తున్న ప్రేక్షకులు ఒక్కసారిగా వచ్చినవారిని చూసి కేరింతలు కొట్టారు. ప్రేక్షకులను ఉద్దేశించి నిహారిక మాట్లాడుతూ, ప్రేక్షకులకు సినిమా బాగా నచ్చిందని, మంచి ఆదరణ లభించిందన్నారు. సినిమా బాగా రావడంతో చిరంజీవి సైతం యూనిట్ అంతటిని ఇంటికి పిలిచి అభినందించారని చెప్పారు. ఆయన సపోర్టు చాలా సంతోషం ఇచ్చిందన్నారు. మంచి చిత్రాలు నిర్మించేందుకు కృషిచేస్తామన్నారు. చిత్రయూనిట్‌కు జనసేన నాయకులు, థియేటర్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. జనసేన రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో విప్పల్స్ సర్జరీ!

● సంక్లిష్టమైన, ప్రాణాధార శస్త్రచికిత్స నిర్వహణ

● ఆపరేషన్‌కు ముందు పారిపోయిన రోగి

● వైద్యుల అభయంతో సర్జరీ చేయించుకున్న వైనం



ఆంధ్రయ్యతో వైద్యులు కిరణ్‌కుమార్, కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు(మెడికల్), ఆగస్టు 20: తనకు జరగబోయేది అత్యంత క్లిష్టమైన ఆపరేషన్.. ఏడు గంటలపాటు ఐదు దశల్లో జరిగే ఈ సర్జరీ ఏ దశలో సరిగ్గా చేయకపోయినా ప్రాణాలు గాలిలో కలసిపోతాయి. ఈ విషయం తెలుసుకున్న రోగి.. ఆపరేషన్‌కు ముందు వార్డు నుంచి పారిపోయాడు. కుటుంబసభ్యులు, వైద్యులు నచ్చచెప్పడంతో అయిష్టంగానే తిరిగొచ్చి ఆసుపత్రిలో చేరాడు. ఎట్టకేలకు డాక్టర్లు ఆపరేషన్ చేశారు. రోగి భయపడినట్లు ప్రాణాపాయం సంభవించలేదు. ఈ శస్త్రచికిత్సతో రోగికి ప్రాణాపాయం తప్పింది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాట్లో ఉండే, సంక్లిష్టమైన, సాంకేతికంగా ఉన్నతమైన విప్పల్స్ సర్జరీని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రి శుశ్రుతహాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ సర్జరీ వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన వ్యవసాయ కూలి కేతవరపు ఆంధ్రయ్య కొంతకాలంగా ప్యాంక్రియాటిక్ కేన్సర్‌తో బాధపడున్నాడు. చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. ఇతడికి ఆపరేషన్ చేయడమే మార్గంగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రోగి పిత్తాశయం, ప్యాంక్రియాస్ తల భాగం, చిన్నపేగు ప్రారంభ ప్రాంతం, ఇలా ఐదు ప్రాంతాలను కత్తిరించి తిరిగి జీర్ణవ్యవస్థకు జాగ్రత్తగా అతికించాలి. వీటిలో ఏ ఒక్కటి సరిగ్గా అతుక్కోకపోయినా రోగికి ప్రాణాపాయం పొంచి ఉంటుంది. ఈ విషయం తెలిసి రోగి ఒకసారి ఆసుపత్రి నుంచి పారిపోయాడు. వైద్యులు నచ్చచెప్పి, విజయవంతంగా ఆపరేషన్ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.10లక్షలు ఖర్చయ్యే ఈ ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచితగా చేసినట్లు డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. తనకు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణభిక్ష పెట్టిన వైద్యులకు రోగి ఆంధ్రయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కటక్-హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా కటక్, హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07165 హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకు ప్రతీ మంగళవారం రాత్రి 8.10కి బయలుదేరి సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ మీదగా అర్ధరాత్రి దాటాక 12.33కి సత్తెనపల్లి, 1.25కి గుంటూరు, మరుసటి రోజు సాయంత్రం 5.45కి కటక్ చేరుకొంటుంది. నెంబరు 07166 కటక్ - హైదరాబాద్ రైలు ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి గురువారం మధ్యాహ్నం 1.30కి గుంటూరు, 2.15కి సత్తెనపల్లి, రాత్రి 7.45కి సికింద్రాబాద్, 9గంటలకు హైదరాబాద్‌కు చేరుకొంటుందన్నారు. ఈ రైళ్లలో స్లీపర్, ఏసీ త్రీ, టూ టైర్ బోగీలుంటాయని డీఆర్‌ఎం తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి



తిరుపతమ్మ మృతదేహం

రేపల్లె, ఆగస్టు 20: పొలంలో మంగళవారం ఉదయం నాట్లు వేస్తుండగా పిడుగు పడటంతో మహిళ మృతిచెందిన ఘటన అమృతలూరు మండలం కాంచాలవరం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన వారే తిరుపతమ్మ(38) వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలం కాంచాలవరం గ్రామంలో పొలంలో నాటు వేసేందుకు వెళ్లింది. సుమారు 11.30 గంటల సమయంలో చిన్నపాటి గాలులతో వర్షం కురుస్తుండటంతో నాట్లు వేసే సమయంలో పిడుగు పడి తిరుపతమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమెకు భర్త గతంలోనే చనిపోయాడు. కుటుంబ పోషణకై కూలిపనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నది. తల్లి మరణవార్త విని పిల్లలు బోరున విలపిస్తుంటే చూపరులను కంటతడిపెట్టించింది.

మధ్యాహ్న సమయంలో ఇంటిలోకి చొరబడి
వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

పెదకూరపాడు, ఆగస్టు 20: పెదకూరపాడులో 70 సంవత్సరాలు పైబడిన ఓ వృద్ధురాలి ఇంట్లోకి మంగళవారం దర్జాగా వెళ్ళి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు చైన్‌ను లాక్కొని ఆమెపై దాడి చేసిన సంఘటన ఇది. ఎస్ఐ బాణావత్ బాలునాయక్, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడుకు చెందిన చుండు సీతామహాలక్ష్మి (72) తన ఇంటి వరండా లో మంచంపై పడుకొని నిద్రిస్తుండగా వంట గదిలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. వంట గదిలోకి సీతామహాలక్ష్మి వెళ్ళి చూడగా అప్పటికే ఆ గదిలో ఉన్న వ్యక్తి సీతామహాలక్ష్మి పక్కనే ఉన్న కుర్చీలోకి నెట్టి చీరతో కుర్చీకి కట్టారు. నోరు మూయటంతో పాటు ఆమెను కొట్టారు. నా గురించి చెపితే చంపుతానంటూ బెదిరించి పరిగెత్తుకుంటూ వెళ్లాడు. ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద మరో వ్యక్తి స్కూటర్ స్టార్ట్ చేసి ఉండటంతో దానిపై ఎక్కి శ్మశానం మీదుగా అమరావతి రోడ్డు వైపు వెళ్ళినట్లు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారుగా పోలీసులు సీసీ కెమె రాల్లో చూసిన ఆనవాళ్ళ ప్రకారం అంటున్నారు. అందరూ తిరుగుతుండగానే ఘటన జరగటం పెదకూరపాడులో చర్చనీయాంశంగా మారింది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బాలూనాయక్ పరిశీలించి సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ముగ్గురి ఎంపిక

మంగళగిరి సిటీ, ఆగస్టు 20: కోల్‌కతాలో ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు మహిళా లిఫ్టర్లు ఎంపికైనట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలియజేశారు. 57 కిలోల విభాగంలో షేక్ సాదియా అల్మాస్ (మంగళగిరి), 84 కిలోలు పైబడిన విభాగంలో బొల్లినేని చంద్రిక (మంగళగిరి), 84 కిలోల విభాగంలో షేక్ షబ్బీనా (తెనాలి) ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీలకు ఎంపికైన మహిళా లిఫ్టర్లను అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎన్ వంశీకృష్ణ, జీ వెంకటేశ్వర రావు, బి.ప్రసాద్, పీ భాస్కర్, ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌డీ మస్తాన్‌వలి, జీ మల్లేశ్వరరావు, ఆళ్ల పవన్‌కుమార్, పీ సందీప్, ఎస్‌కే సుభానీ, కే మధుబాబు తదితరులు అభినందించారు.



ఎంపికైన మహిళా లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు



వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 20: రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లో సమస్యలు, సౌకర్యాల లేమి ఉన్న ఎడల సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. అనకాపల్లి హాస్టల్ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలోని హాస్టల్స్, వసతిగృహాలు, అనాథాశ్రమాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని తెలిపారు. పురుషోత్తమపట్నంలో మంగళవారం గిరిజన సంక్షేమ పాఠశాల వసతి గృహాన్ని ప్రత్తిపాటి తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతుల కల్పనలో నిర్లక్ష్యం గురించి విద్యార్థులు ప్రత్తిపాటి ఎదుట ఏకరువు పెట్టారు. మరుగుదొడ్ల దుస్థితి, భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయని, వాన వస్తే నీరుగారి సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పందిస్తూ పాఠశాల వసతిగృహంలో సమస్యలు, వసతుల కల్పన గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణితో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని, వారి సంఖ్యను పెంచటంపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇకపై క్రమం తప్పకుండా నియోజక వర్గ పరిధిలోని అన్ని వసతిగృహాలను తరచూ సందర్శిస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమస్యలు ఏమున్నా ధైర్యంగా తమ దృష్టికి తీసుకు రావచ్చని, బాధ్యులపై చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18,250 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 20: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 35వేల 727 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18వేల 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 20: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,212 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 47,212 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 29 వేల క్యూసెక్కులు నీరు విడుదల

● 1.02 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 20: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 3 క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21వేల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8వేలు మొత్తంగా 29వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.02 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 7.02 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.45 మీటర్లకు సమానమన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 20: పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు పిడుగురాళ్ల స్టేషన్ దాటిన కొద్ది సేపటికే ఓ వ్యక్తి రైలు పట్టాల మధ్య కూర్చొని ఉన్నట్లు గుర్తించిన లోకో పైలెట్ రైలును నిలిపివేసేందుకు ప్రయత్నించే లోగా రైలు ఆ వ్యక్తిని ఢీకొట్టింది. వెంటనే రైలును నిలిపి వేసి మృతదేహాన్ని పరిశీలించగా రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రైలుపట్టాల మధ్య లో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ప్రయాణికుల సాయంతో బయటకు తీసి 108కు ఫోన్‌చేసే లోపు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. 45సంవత్సరాల వయసు కలిగి ఉన్న ఆ వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

అనారోగ్యం...
యువకుడి ఆత్మహత్య



మరియదాసు(ఫైల్)

ఫిరంగిపురం, ఆగస్టు 20: ఫిరంగిపురంలోని శాంతిపేటకు చెందిన టప్పెట మరియదాసు(21) అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు గడ్డి మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడని బంధువులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

55,420 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 58,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 55,420 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 22,845 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	800017500	
నెంబరు. 5	10500	14500
273	10800	14500
341	10000	14500
4884	11800	11800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700
బ్యాడిగి	8200	14000
దేవనూరుడీలక్స్	10000	12800
తెల్లకాయలు	4500	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15000
నెంబరు. 5	11000	11500
273	12000	12000
341	10000	16000
4884	11800	11800
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18900
బ్యాడిగి	10000	14500
దేవనూరుడీలక్స్	11500	15000
తెల్లకాయలు	4500	10500

బాపట్ల వార్తలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, డాక్టర్ పి.సురేష్ తదితరులు

సొసైటీ సభ్యులకు సర్టిఫికెట్‌లు ప్రదానం

బాపట్ల, ఆగస్టు 20 : మండలంలోని అడవిగ్రామపంచాయతీ రామచంద్రపురంలో జై సూర్య ఫిష్‌ఫార్మర్ ప్రొడ్యూసర్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు మంగళవారం సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పంపిణీ చేశారు. సభ్యులు మొత్తం 350 మంది ఒక్కొక్కరు 2 వేల రూపాయలు చొప్పున పొదుపు చేసుకోగా కేంద్రప్రభుత్వం 2 వేల రూపాయలు చొప్పున మ్యాచింగ్ గ్రాంట్ జమ చేసింది. ఈ విధంగా సభ్యులు మొత్తం రూ.7 లక్షలు జమ చేయగా ప్రభుత్వం అందించిన మరో రూ.7 లక్షలు కలిపి మొత్తం రూ.14 లక్షల మూలధనం చూపించి బ్యాంక్ ద్వారా రుణసదుపాయం పొంది వ్యాపారం చేసి వచ్చిన లాభాలను సభ్యులకు పంచేవిధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సొసైటీ సర్టిఫికెట్‌లను లబ్ధిదారులకు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏడీ కృష్ణ, బోర్డు డైరెక్టర్ పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు అనీల్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పికట్ల సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే వేగేశన పూజలు

మండలంలోని అప్పికట్ల గ్రామంలో ఉన్న చిన్న సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్తులు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ ఎమ్మెల్యేగా గెలిచినందుకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, టీడీపీ నాయకులు గుత్తికొండ రాజేష్, కుర్రా మాధవరావు, సర్పంచ్ రజనీ, ఆచంట అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి : డీపీవో



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారి హనుమంతరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి, డాక్టర్ రేచల్ దివ్య

బాపట్లరూరల్, ఆగస్టు 20 : గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరిచే విషయంలో పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి రవి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాలలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను చేపడుతూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పులి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

కర్లపాలెంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

కర్లపాలెం, ఆగస్టు 20 : కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడు రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతిపేటలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు సున్నం, బ్లీచింగ్ చల్లించారు. మురుగు గుంతలలో ఏబెట్ మందులు పిచికారి చేయించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



ముత్తాయపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రవి

కర్లపాలెం, ఆగస్టు 20 : జిల్లాలోని 4 నుంచి 8 నెలలు వయసు గల ఆడదూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు, నాలుగునెలలుపైబడిన ఆవులకు, గేదెలకు, గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి మద్దు హనుమంతరావు అన్నారు. ఈ టీకాల కార్యక్రమం ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 18 వరకు కొనసాగుతుందన్నారు. మండలంలోని ఏట్రవారిపాలెం, కొత్తనందాయపాలెం గ్రామాలలో మంగళవారం పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని ఉపయోగించుకోవాలనే కరపత్రాలను సర్పంచ్ వెంకటలక్ష్మి, వైద్యసిబ్బంది ఆవిష్కరించారు. దూడలకు, పశువులకు, ఆవులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు టి.శంకరరావు, మండల పశు వైద్యాధికారి ఎం.రేచల్ దివ్య, సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

బాపట్ల, ఆగస్టు 20 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం కొనసాగాయి. దీక్షలను ఉద్దేశించి అంటరానితనం నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వక మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ తీర్పునివ్వటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవటంతో బుధవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునివ్వటం జరిగిందన్నారు. శిబిరంలో గుదే రాజారావు, కాగిత కోటేశ్వరరావు, పెరికల జోసఫ్, రేగులగడ్డ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలి

● జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

బాపట్ల, ఆగస్టు 20 : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా, వ్యూహాత్మకంగా చిత్తశుద్ధితో అధికారులంతా పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాపంచాయతీ అధికారులు, డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదిన జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశించారన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలను ప్రణాళిక బద్ధంగా సమర్ధవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈనెల 23 నుంచి అన్ని గ్రామపంచాయతీలలో జరిగే గ్రామసభలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్షించి చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజులపాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ పగడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చెత్తనిల్వ కేంద్రాలను అక్టోబరు 2వ తేదీ నాటికి వాడకంలోకి తీసుకురావాలన్నారు. ఫ్రీవన్ యాప్ ద్వారా జిల్లాలోని జనవాసాల మధ్య ఉన్న మురుగుకాల్వలు, తాగునీటి ట్యాంక్‌లు శుభ్ర పరిచి చెత్తకుప్పలు పూర్తి స్థాయిలో తొలిగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఓడీఎఫ్ సర్వే రెండురోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీలలో దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గ్రామసభలను సమర్ధవంతంగా నిర్వహించి జిల్లాను ప్రథమస్థానంలో ఉంచాలని కోరారు. సమావేశంలో డీపీవో, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ఎంఈవో -1 ఉయ్యూరి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయులు

ఎంఈవోను సన్మానించిన ఫ్యాప్టో

పిట్టలవానిపాలెం, ఆగస్టు 20 : బాపట్లలో స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు ఉత్తమ ప్రశంస అవార్డు అందుకోవటం ఎంతో అభినందనీయమని ఫ్యాప్టో ఉపాధ్యాయులు అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవార్డు గ్రహీత ఉయ్యూరి వెంకటేశ్వరరావును ఫ్యాప్టో ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఎంఈవో-1 కె.రాజారత్నం మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఎంఈవో తనవంతు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరిశా నరసింహారెడ్డి, చక్రపాణి, అమర్‌నాథ్, అనంతరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్‌లు పంపిణీ

బాపట్ల, ఆగస్టు 20 : ప్రముఖ సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలలో భాగంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు 200 మందికి పోషకాహార కిట్‌లను మంగళవారం పంపిణీ చేశారు. పడమటి సత్యనారాయణరావు జ్ఞాపకార్థంగా పడమటి ధర్మారావు సమకూర్చిన కిట్‌లను ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ పంపిణీ చేశారు. చిరంజీవి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థి కావటం ఆనందదాయకమన్నారు. ఆయన పుట్టినరోజు కానుకగా చదివిన పాఠశాలలోని విద్యార్థులతో సంతోషం పంచుకోవటం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు, మాడా రామకృష్ణ, తిమ్మన శేషు, చిరంజీవులు లక్ష్మణ్, కొలను మోహన్, సంగీత ఏసోబు, కేఎల్ రావు, పీఈటీ కత్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, నిర్వాహకులు

భూ సర్వే చేయించాలని వినతి

బాపట్ల, ఆగస్టు 20 : పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న ఆకుతోట నాగేశ్వరరావు భూమిని సర్వే చేయించి ఇవ్వాలని అనేక పర్యాయాలు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవటం లేదంటూ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు వారసత్వంగా మరుప్రోలువారిపాలెంలో 103/1ఎలో 2.25 ఎకరాల భూమి ఉందని, సదరు భూమి నెంబరుపై కొంతమంది ల్యాండ్ మాఫియా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై చర్యలు తీసుకొని తన భూమి సర్వే చేయించి ఇవ్వాలని కోరారు.

హోం మంత్రి వంగలపూడిని కలిసిన పల్లం సరోజని



సరోజనీని అభినందిస్తున్న రాష్ట్ర హోం శాఖా మంత్రి అనిత

బాపట్ల, ఆగస్టు 20 : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను మంగళవారం బాపట్ల పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలతోపాటు మహిళా సంక్షేమం కోసం కృషి చేస్తున్న పల్లం సరోజనీని హోంమంత్రి అభినందించారు. వివిధ అంశాలపై చర్చించారు.

ఆవులను యజమానులు తీసుకెళ్ళాలి : కమిషనర్

బాపట్ల, ఆగస్టు 20 : బాపట్లలో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రమాదాలకు కారణమౌతున్న ఆవులను యజమానులు తీసుకెళ్ళాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే అనేక ఆవులను యజమానులు తీసుకెళ్ళినప్పటికి ఇంకా 30 ఆవులు పట్టణంలో సంచరిస్తున్నట్లు గుర్తించి రైలుపేటలోని మహాప్రస్థానం క్షేత్రంనకు తరలించటం జరిగిందన్నారు. యజమానులు వచ్చి చలాన కట్టి ఆవులు తీసుకెళ్ళాలని లేనియెడల కోటప్పకొండలోని గోశాలకు తరలిస్తామన్నారు. లేకుంటే అడవులలో వదిలిపెట్టి వస్తామని చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ఒకరు మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 20 : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన టంగు వెంకటేశ్వరరెడ్డి భార్య లలిత వారి ఇద్దరు కుమార్తెలు టంగు రేణుక, టంగు యోగానందినిలతో కలిసి జీవనోపాధిగా కోసం చీరాల నియోజకవర్గం వేటపాలెం గ్రామంలో రొయ్యల చెరువుల దగ్గర కాపలా ఉంటూ జీవనం గడుపుతున్నారు.

సోమవారం రాఖీ పండుగ సందర్భంగా టంగు వెంకటేశ్వరరెడ్డి, సోదరీ గ్రామమైన వాడరేవుకు వెళ్ళి రాఖీ కట్టించుకొని కుటుంబ సభ్యులతో తిరిగి వేటపాలెం వెళుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొనగా ద్విచక్రవాహనంపై ఉన్న ఆ నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. టంగు యోగానంది (12) అక్కడక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయాలైన వెంకటేశ్వరరెడ్డి, అతని భార్య లలిత, పెద్ద కుమార్తె రేణుకను మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. వెంకటేశ్వరరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

సాగు పద్ధతులు పాటించాలి : ఏడీఏ

కొల్లూరు, ఆగస్టు 20 : మారుతున్న వాతావరణాన్ని అనుసరిస్తూ సాగు పద్ధతులు పాటించాలని బాపట్ల ఏడీఏ అక్తర్ హుస్సేన్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని క్రాపలో ఆత్మ గుంటూరు వారి ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, భూమికి జీవం అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ, వరి పైరులో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని, విచక్షణ రహితంగా ఎరువుల వినియోగంతో సాగుఖర్చు పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రధాన శిక్షకులు కొల్లూరు బాలాజీ, బీమరాజు వివరించారు. చీడపీడల నివారణకు కావాల్సిన కషాయాల తయారీ విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అక్తర్ హుస్సేన్

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

నగరం, ఆగస్టు 20 : ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీ రేట్ల కంటే మించి అమ్మితే ఉపేక్షించేది లేదని మండల వ్యవసాయశాఖాధికారి వి.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మంగళవారం వ్యవసాయశాఖాధికారులు తనిఖీ నిర్వహించారు. అనంతరం షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరపాలని, నకిలీ మందులు విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వ్యవసాయ శాఖా సిబ్బంది, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

వేమూరు, ఆగస్టు 20 : ఖరీఫ్ సాగు రైతులు ప్రతి ఒక్కరూ పంట నమోదు చేయించుకోవాలని వేమూరు మండల వ్యవసాయశాఖ అధికారిని సిహెచ్ సునీత కోరారు. మంగళవారం బూతుమల్లి గ్రామంలో నిర్వహించిన పంట నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. 2024సీజన్‌కు సంబంధించి సంబంధిత రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీ ఆధార్ జిరాక్స్ కాపీలను సమర్పించాలన్నారు. కౌలు రైతులయితే ప్రభుత్వం మంజూరు చేసిన కవులు రైతు కార్డును జతపరచాలన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే ప్రభుత్వం పరిహారాన్ని అందిస్తుంది అన్నారు. పంట కొనుగోలుకు కూడా అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ అవకాశాన్ని రైతులు తప్పని సరిగా వినియోగించుకోవాలని కోరారు.



బూతుమల్లిలో పంట నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఏవో సునీత

సర్వే ద్వారా జ్వర పీడితులు గుర్తింపు

● వైద్యాధికారి వెంకట సురేష్‌బాబు

వేమూరు, ఆగస్టు 20 : వైరల్ ఫీవర్లు అధికంగా ఉండటం వల్ల సంబంధిత బాధితులను గుర్తించేందుకు మండల పరిధిలోని 17 గ్రామాలలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్‌బాబు తెలిపారు. పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన తమ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్న సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ సర్వే ద్వారా జ్వరపీడితులైన వారికి ముందస్తు జాగ్రత్త కోసం ఇంటి వద్దనే రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళాల్సిన పని లేదని నాణ్యమైన వైద్యాన్ని పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా, వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో ఇంత వరకు ఒక్కరికి కూడా డెంగీ ఫీవర్ రాలేదని ప్రజలు కొన్ని పుకార్లను నమ్మవద్దని కోరారు. ప్రతి గ్రామంలో తమ సిబ్బందిని 24 గంటలు అందుబాటులోకి ఉంచడంతో పాటు ప్రతి గ్రామంలో మందులను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పంచాయితీల సహకారంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, పకడ్బందీగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

కర్లపాలెం, ఆగస్టు 20 : మండలంలోని పేరలిపంచాయతీ చాకలిపాలేనికి చెందిన పోతర్లంక శ్రీనివాసరావు మృతి చెందటంతో మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో రూ.5 వేల నగదును కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపూరి భూపతిరావు, గేరా ఏసుబాబు, కాగిత విజయరాజు, మద్దిబోయన బుల్లియ్య, వడ్లమూడి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లె, ఆగస్టు 20 : విద్యలో రాణించి పట్టాను పొందిన విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక శారదా ఐటీఐ కళాశాలలో మంగళవారం ఐటీఐ విద్యార్థులకు ప్రధానమంత్రి కౌసిక్ వికాస్ యోజన పథకం (పీఎంకేవీవై) సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన పరికరాలను పరిశీలించారు. అలాగే కాలేజీ కరస్పాండెంట్ బడుగు వెంకటనారాయణ మాట్లాడుతూ మూడు కోర్సులకు 105 మంది విద్యార్థులకు మూడు నెలల పాటు ట్రైనింగ్, కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించి పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందించామన్నారు. 102 మంది విద్యార్థులు 98 శాతం పాస్ అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కన్వీనర్ జీ.సుధాకర్‌బాబు, విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరిశా వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఐ చెన్ను నాగమల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ బడుగు జ్యోస్నా, అధ్యాపకులు మేరుగ నాగార్జున, ఎం.ప్రసాద్, హరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె, ఆగస్టు 20 : కాలుష్య కోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని చిరంజీవి అఖిల భారత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక చిరంజీవి అభిమానులు తోట వెంకట రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేప, మామిడి, ఉసిరి, అశోక్ చెట్లను నాటారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణాన్ని కాపాడేందుకు చిరంజీవి అభిమానులు నడుంబిగించాలని కోరారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కొలసాని కోటేశ్వరరావు, నల్లపాటి రాజశేఖర్, బేతపూడి రామారావు, కొట్రా నాంచారయ్య, ఎం.అప్పారావు, కల్యాణచక్రవర్తి, యుగంధర్‌నాయుడు, కె.జగదీష్, తోట శ్యామ్ పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న మేకల రవీంద్రబాబు తదితరులు

విద్యార్థులు మత్తుకు బానిసకావొద్దు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 20 : విద్యార్థులు చెడు వ్యసనాలకు, గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కారాదని న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వాలెంటర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె పాతపట్నంలో మున్సిపల్ హైస్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ మోజులో పడవద్దన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కారాదని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ వాలెంటీర్ యానాదిరావు, కోశాధికారి ఆచార్యులు, ఇన్‌చార్జ్ హెచ్ఎం పుల్లారావు, చెన్ను నాగమల్లేశ్వరరావు, తాహేద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 20 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ లలితకుమారి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని వెల్లటూరు పీహెచ్‌సీలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు వ్యాధులు సోకే విధంగా ఉన్నాయని, అయా వ్యాధుల బారిన నుంచి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏఎన్ఎంలు, ఆశాలు వివరించాలన్నారు. అనంతరం ఇటీవల కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్యురాలు రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

వేమూరు, ఆగస్టు 20 : జల జీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని జంపని గ్రామంలో డయేరియాపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు టి.పోతురాజు అధ్యక్షత వహించారు. సదస్సులో బాపట్ల జిల్లా కో ఆర్డినేటర్ టి.రంగారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్ర వాతావరణంలో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్‌కుమార్, పోతురాజు మాట్లాడారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవిరాజు, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ వైద్యనిపుణులతో శిబిరం

బాపట్ల, ఆగస్టు 20 : బాపట్ల ఏరియా వైద్యశాలలో ప్రతినెల మొదటి, మూడో బుధవారాలలో ప్రత్యేకక్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపారు. అమెరికన్ అంకాలజి ఇనిస్టిట్యూట్ గుంటూరు నుంచి ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బాపట్ల పరిసర ప్రాంత ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9121177416 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జూదరులు అరెస్టు

కొల్లూరు, ఆగస్టు 20 : కొల్లూరులోని చింతలమ్మ దేవాలయం సమీపంలోని ఓ ఖాళీ ప్రదేశంలో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.6200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదరమ్

డబ్బు కొట్టు.. సర్టిఫికెట్ పట్టు..!

- భారీగా దివ్యాంగ పింఛన్ దొంగలు
- అడ్డగోలుగా నకిలీ వికలత్వ ధ్రువపత్రాలు
- వైసీపీ హయాంలో ఇష్టారీతిన జారీ
- ప్రభుత్వం నుంచి అనర్హులకు లబ్ధి
- మార్కాపురం డివిజన్‌లో వందల్లోనే ఉన్నట్లు సమాచారం
- అధికారులు దృష్టిపెడితేనే అడ్డుకట్టప

మార్కాపురం డివిజన్‌లో యథేచ్ఛగా నడిచిన దొంగ వైకల్య సర్టిఫికెట్ల దందా భారీగా నడిచింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో ఆ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఆరితేరిపోయారు. వైకల్యం లేకపోయినా ఉన్నట్లు దొంగ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరు వైద్యులు కూడా అవినీతికి అలవాటు పడి విచ్చలవిడిగా జారీచేశారు. ఆ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్‌ను తీసుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

మార్కాపురం, ఆగస్టు 20: గత వైసీపీ పాలన సమయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలు అనుచిత లబ్ధి పొందారు. వైకల్యం ఉన్నా లేకపోయినా, ఇష్టారీతిగా సదరమ్ సర్టిఫికెట్లు పొందారు. వాటిని అడ్డుపెట్టుకుని దివ్యాంగ పింఛన్‌ను అప్పనంగా కొట్టేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను కూడా ఆరగించేస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గం పరిధిలో గత ఐదేళ్లలో ఈ విధంగా వందలాది మంది దొంగ సర్టిఫికెట్లు పొంది రూ.లక్షల్లో ప్రజాధనాన్ని బొక్కేశారు. మార్కాపురం పట్టణంలో ఒక వైసీపీ కార్యకర్త దొంగ సర్టిఫికెట్‌తో అక్రమంగా పింఛన్ పొందుతున్నట్లు ఓ టీడీపీ కార్యకర్త ఆధారాలతో ఫిర్యాదుచేసినా పట్టించుకున్న నాథుడే లేడు. చివరికి కోర్టుకు వెళ్లి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనర్హులైన వారిని గుర్తించే పని కూటమి నాయకులు మొదలుపెట్టారు.

డబ్బులిస్తే క్షణాల్లో సదరమ్ సర్టిఫికెట్

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గతంలో జిల్లా వైద్యశాలగా ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో జిల్లా వైద్యశాలలో ఆ పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా కొందరు వైద్యులు పనిచేశారు. ముఖ్యంగా వికలత్వ సర్టిఫికెట్‌కు స్థాయిని బట్టి రూ.30వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ అక్రమ వ్యవహారానికి వైద్యశాలలో ఒప్పంద పద్ధతిపై పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. పేరుకు పారిశుధ్య కార్మికుడే అయినా ఆయన సూపరింటెండెంట్ వద్ద అనధికారికంగా సహాయకునిగా పనిచేస్తుండేవాడు. వైద్యులతో ఉన్న చనువును ఆసరా చేసుకొని ఎలాంటి వికలత్వం లేకపోయినా రూ.వేలల్లో వసూలు చేసి క్షణాల్లో సర్టిఫికెట్లు జారీ చేయించాడు. వాటిని అడ్డుపెట్టుకునే వందలాది మంది వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు పింఛన్లు పొంది ప్రజాధనాన్ని కొట్టేశారు. చివరకు ఆ ఒప్పంద ఉద్యోగి కూడా శాశ్వత వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొంది ప్రభుత్వం నుంచి పింఛన్ పొందడం గమనార్హం. దొంగ సర్టిఫికెట్లతో ఇంత స్థాయిలో ప్రజాధనం లూటీ అవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి అధికారులకు అక్రమ పింఛన్లపై ఇప్పటికే కొన్ని వందల ఫిర్యాదులు అందాయి. అన్ని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో అంటకాగిన అధికారులే నేటికీ కీలక పోస్టుల్లో ఉండటంతో ఫిర్యాదులన్నీ బుట్టదాఖలవుతున్నాయి. మరీ ముఖ్యంగా మండలస్థాయిలో పింఛన్ల బాధ్యత చూడాల్సింది మండల పరిషత్తు అధికారులే. వారికి ఫిర్యాదులు అందింతే ఇవి తాము మంజూరు చేసిన సర్టిఫికెట్లు కావు కాబట్టి రెవెన్యూ, మెడికల్ డిపార్ట్‌మెంట్లకు ఫిర్యాదులు చేసుకోవాలని తప్పించుకుంటున్నారు. మెడికల్, రెవెన్యూ శాఖల దగ్గరకెళ్తే తమకేం సంబంధం లేదని తెగేసి చెబుతున్నారు.

వాస్తవానికి పింఛన్లు అందించే మండల పరిషత్తు అధికారులే ఫిర్యాదులు స్వీకరించి వారికి సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవో, కావో విచారణ చేయాల్సిన బాధ్యత ఉంది. పట్టణ స్థాయిలో అయితే మున్సిపాలిటీది ఆ బాధ్యత. కానీ అధికారుల బదిలీలు లేకపోవడంతో గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న అధికారులు కావడంతో ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు.

అక్రమంపై దృష్టిసారించిన కూటమి నాయకులు

నియోజకవర్గంలో దొంగ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్ పొందుతున్న వ్యవహారంపై కూటమి నాయకులు దృష్టిసారించారు. పట్టణంలో ఇప్పటికే వార్డుల వారీగా దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారి వివరాలు సేకరించి విచారిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన పింఛన్లపైనే ఎక్కువగా దృష్టిసారించారు. చిన్నపాటి వైకల్యం ఉన్నా శాశ్వత అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్‌లు పొందిన వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సక్రమంగానే పరీక్షలు జరుపుతున్నాం

- డాక్టర్ పి.సావిత్రి, సూపరింటెండెంట్

మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి సక్రమంగానే సదరమ్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ప్రతి విభాగానికి అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. అన్నివిధాలా పరీక్షించాకే సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. గతంలో ఏమి జరిగిందో తెలియదు. జిల్లా వైద్యశాలగా ఉన్నప్పుడు పలు ఆరోపణలు వచ్చాయి. ఈ మధ్యనే కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫిర్యాదుల విషయమై మాతో మాట్లాడారు.



పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

- 23న అన్నిగ్రామ పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణ
- ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో పనుల ఆమోదానికి చర్యలు



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20 : గ్రామ పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నిలిచిపోయిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులను చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలను చేసే విధంగా చర్యలు చేపట్టారు. జిల్లాలోని 730 గ్రామపంచాయతీల్లో అభివృద్ధితోపాటు గతంలో జరిగిన అనుసంధాన పనులను ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఆదేశించారు. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 23వ తేదీన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

వైసీపీ హయాంలో నిధులు ఇవ్వక...

ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వక గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించేందుకు ఈ సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలో ఆ పంచాయతీ పరిధిలోని జనాభాలో కనీసం 30శాతం మంది పాల్గొనే విధంగా రెండు రోజుల ముందు విస్తృతంగా ప్రచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామసభలో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే పనులను ప్రజలతో చర్చించి ఆమోదించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఆ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులను కూడా ఆ గ్రామసభల్లోనే ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కూటమి ప్రభుత్వంలో ఏ విధంగా అభివృద్ధి చేస్తామో తెలపాలని నిర్ణయించారు. మరోవైపు గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచేందుకు తీసుకోవాల్సిన అంశాలపై కూడా ప్రభుత్వం దిశానిర్దేశం చేయడంతో అందుకు అనుగుణంగా గ్రామసభల్లో చర్చించనున్నారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా ఈ గ్రామసభల్లో చర్చించనున్నారు. అందుకోసం పంచాయతీల వారీ తగిన ప్రణాళికలు రూపొందించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

దోమల నియంత్రణపై డ్రోన్ యుద్ధం

మురుగునీటి కాలువల్లో స్ప్రే చేసి లార్వా నిర్మూలన

పారిశుధ్యం మెరుగుకు నగరంలో నూతన విధానం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 20: పారిశుధ్యం మెరుగునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, దోమల బెడదను పూర్తిస్థాయిలో తొలగించే ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు గత రెండు రోజులుగా ఒంగోలు నగరంలో మురుగుకుంటలు, ఖాళీస్థలాలు, అలాగే పోతురాజుకాలువలో పారిశుధ్య కార్మికుడు వెళ్లలేని ప్రాంతాల్లోకి డ్రోన్ల సహాయంతో స్ప్రేయింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఒంగోలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పంట పొలాలకు డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేయగా, తొలిసారిగా, దోమల నియంత్రణకు ఈ చర్యలు చేపట్టారు. పోతురాజు కాలువ, గణపతినగర్, బిలాల్‌నగర్, ఇతర శివారు కాలనీల్లో డ్రోన్‌ద్వారా ఆయిల్ స్ప్రే చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తద్వారా నిల్వ ఉన్న మురుగు నీటిలో లార్వా ఉత్పత్తి కాకుండా, క్షేత్రస్థాయిలోనే దోమలను నియంత్రించవచ్చని కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఈప్రక్రియ మరో రెండు, మూడు రోజులు జరుగుతుందని అధికారులు తెలిపారు.



ఇస్లాంపేటలో పోతురాజు కాలువపై డ్రోన్ ద్వారా దోమల మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

నిర్లక్ష్యం మిగిల్చిన విషాదం

- కారు ఢీకొట్టిన ఘటనలో చిన్నపాప మృతి
- కోమాలో తల్లిదండ్రులు
- దిక్కుతోచని స్థితిలో పెద్దకుమార్తె



వెంకటేశ్వరరెడ్డి కుటుంబం(ఫైల్)

చీరాలటౌన్, ఆగస్టు 20 : రాఖీ పండుగ రోజు జాతీయ రహదారి రక్తసిక్తమైంది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ కుటుంబాన్ని దిక్కుతోచని స్థితిలోకి చేర్చింది. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా పిట్లవానిపాలెం మండలం పిట్టువానిపాలెం గ్రామానికి చెందిన టంగు వెంకటేశ్వరరెడ్డి(40) సుమారు 15 ఏళ్ల కిందట చీరాల మండలం వాడరేవు పరిధిలోని కొత్తపాలెంకు చెందిన లలితతో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదవ తరగతి చదువుతున్న రేణుక(13), 6వ తరగతి చదువుతున్న నందిని(12) సంతానం. భార్యాభర్తలు చినగంజాం పరిధిలో చెరువుల వద్ద కాపలా ఉంటూ పిల్లలిద్దరినీ చినగంజాం హైస్కూల్‌లో చదివిస్తున్నారు. ఆనందంగా సాగిపోతున్న వీరి జీవితాల్లోకి రోడ్డు ప్రమాదం విషాదం మిగిల్చింది.

పచ్చమొగిలిలో ఉంటున్న లలిత సోదరుడికి రాఖీ కట్టేందుకు ద్విచక్ర వాహనంపై కుటుంబమంతా పచ్చమొగిలి వచ్చారు. సోదరునికి రాఖీ కట్టి రాత్రి వరకు సంతోషంగా గడిపారు. తిరిగి ద్విచక్ర వాహనంపై చినగంజాం వెళ్లేందుకు పయనమయ్యారు. బయలుదేరిన 10 నిమిషాలకే వేటపాలెం జాతీయ రహదారిలోని నాయినిపల్లి వద్దకు వద్ద ఒంగోలు నుంచి చీరాల వైపు వస్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వస్తూ వీరిపైకి దూసుకొచ్చాడు. దీంతో సుమారు పది మీటర్లు అవతలికి ద్విచక్ర వాహనం ఎగిరిపడింది. ఈఘటనలో చిన్న కుమార్తె నందిని(12) అక్కడికక్కడే మృతిచెందింది. పెద్ద కుమార్తెకు స్వల్ప గాయాలు కాగా తల్లిదండ్రులు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి కోమాలోకి చేరారు. తండ్రి వద్ద ఉన్న ఫోన్ తీసుకుని రేణుక పచ్చమొగిలిలోని బంధువులకు చెప్పింది. అయితే ఈలోగా వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని చిన్న కుమార్తె మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. గాయాలైన ముగ్గురినీ చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు కుటుంబ సభ్యుల సహాయంతో తరలించారు. చిన్న కుమార్తె మృతదేహం చీరాల మార్చురీలో ఉండగా, తండ్రి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో, పెద్ద కుమార్తె, లలిత మరో ఆసుపత్రిలో ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కోమాలో ఉండగా, వారి పరిస్థితి విషమంగానే ఉంది. దీంతో నందిని మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన పోలీసులు బంధువులకు అప్పగించారు. అయితే కన్న బిడ్డ అంత్యక్రియలు విషయం తల్లిదండ్రులు తెలియని పరిస్థితిలో ఉండడం అందరినీ కలచివేసింది. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌ను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సిద్ధం?

- 12 మందితో ఖరారు
- నేడో, రేపో వెల్లడించే అవకాశం



చీరాల ఏరియా వైద్యశాల

చీరాల, ఆగస్టు 20: చీరాల ఏరియా వైద్యశాల అభివృద్ధి సొసైటీ కమిటీ పేర్లు ఖరారైనట్లు విశ్వసనీయం సమాచారం. కమిటీలో 12 మంది పేర్లు ఉన్నట్లు తెలిసింది. ఆ వివరాలు రెండుమూడు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది. హెచ్‌డీఎస్ (హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) కమిటీ ఏర్పాటుతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

జిల్లాలోనే అత్యంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి చీరాల దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రభుత్వ ఆసుపత్రి. 100 పడకల సామర్థ్యం ఉన్న ఈ హాస్పటల్‌లో ప్రస్తుతం ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి వైద్యుడు తప్ప మిగిలిన అన్ని విభాగాలకు వైద్యం అందుబాటులో ఉంది. ఆర్థోపెడిక్ విభానికి కూడా వైద్యురాలు వచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఆ డాక్టర్ చేరితే ఎలుకలు, కీళ్ల విభాగానికి సంబంధించి ఇతర ప్రాంతాలకు రోగులకు పంపే అవసరం లేకుండా స్థానికంగా వైద్యసేవలు అందించేందుకు మార్గం సుగమం అవుతుంది. గుండె సంబంధిత వ్యాధుల విభాగం లేదు. అత్యవసర సేవలకు సంబంధించి స్టెమీ విధానం ద్వారా హార్ట్ ఎటాక్ వచ్చినవారికి సైతం ప్రాథమిక చికిత్స అందించి, తరువాత మెరుగైన వైద్యానికి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. స్టెమీ పద్ధతిలో హార్ట్ ఎటాక్ వచ్చిన వ్యక్తికి వెంటనే రక్తాన్ని పలచబరిచే(గడ్డ కట్టకుండా) ఇంజక్షన్ ఇస్తారు. ఈసీజీ రిపోర్టు ఒంగోలు లేదా గుంటూరు ప్రభుత్వ మెడికల్ హాస్పటల్స్‌కు చేరుతుంది. ఆ ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.30వేలు ఉంటుంది. దానిని రోగికి ఉచితంగానే ఇస్తారు. ఏరియా వైద్యశాలకు ఉన్న వనరులను వినియోగించుకోవడంలో కొంత విఫలమవుతున్నారు. దీంతో మెరుగైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాత భవనాలను పూర్తిగా వినియోగించుకుంటే..

పాత ఆసుపత్రి భవనాలను పూర్తిగా మరమ్మతులు చేయించి వినియోగించుకుంటే రోగులకు ఎంతో సౌకర్యవంతమైన సేవలు అందించవచ్చు. అందుకు అనుగుణంగా వచ్చే హెచ్‌డీసీ కమిటీ తగిన బాధ్యతలు తీసుకోవల్సి ఉంటుంది. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

హెచ్‌డీసీ కమిటీ ఎవరు..

మొత్తం 12 మందితో హెచ్‌డీసీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అందులో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఛైర్మన్‌గా ఉంటారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిని, మున్సిపల్ ఛైర్మన్, ఆర్డీవో, ఏడీఎంహెచ్‌వో, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్, ఇద్దరు సోషల్ వర్కర్లు (వీరిలో ఒకరు సోషల్ యాక్టివిస్ట్, వైద్యురాలు) హాస్పటల్ వైద్యులు ఒకరు, చారిటీస్ నుంచి ఒకరు, మరో వ్యక్తిగా వైద్యునిగా, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా అందరితో మమేకం అవుతున్న డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలిపి మొత్తం 12 మందితో కమిటీకి తుది రూపం ఇచ్చినట్లు సమాచారం. ఒకటి అర పేరు మార్పు తప్పించి మిగతా కమిటీని నామినేట్ చేసే అవకాశం ఉంది.

మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యం

- డాక్టర్ సుభాషిణి, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. హెచ్‌డీఎస్ కమిటీ ఏర్పాటు దాదాపు ఖరారైంది. వచ్చే వారంలోగా మొదటి సమావేశం కూడా నిర్వహించే ప్రణాళికతో అడుగులు వేస్తున్నాం. పాత ఆసుపత్రి భవనాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు కమిటీ దోహదపడుతుందని భావిస్తున్నాం.

కొనసాగుతున్న టీచర్ల పని సర్దుబాటు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు మొదటిదశ ప్రక్రియ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ ప్రక్రియ సోమవారమే ప్రారంభమైంది. టీచర్ల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు రావడంతో మొదటి రోజు 30 మండలాల్లో సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోయింది. కేవలం ఎనిమిది మండలాల్లో మాత్రమే పూర్తయింది. రెండో విడత ఈనెల 18, 19 తేదీల్లో విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలు తెలుపుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో 30 మండలాల నుంచి మిగులు టీచర్ల జాబితాలపై అభ్యంతరాలు రావడంతో ఆ మండలాల్లో సర్దుబాటు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. ఈ మండలాల నుంచి 54 అభ్యంతరాలు రావడంతో గుంటూరు ఆర్‌జేడీ ద్వారా వాటిని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఆ అభ్యంతరాల్లో కొన్నింటికి పరిష్కారం లభించడంతో 30 మండలాల్లో మొదటిదశలో చేపట్టిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మొదటగా మిగులుగా తేలిన సబ్జెక్టు టీచర్లు తాము పనిచేస్తున్న యాజమాన్యాల్లోని పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఆ తర్వాత ఇతర యాజమాన్యాల్లో మిగిలిపోయిన ఖాళీలకు ఆయా టీచర్లను సర్దుబాటు చేశారు.

ఒంగోలులో పూర్తి

ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలం పరిధిలోని టీచర్ల సర్దుబాటు మొదటిదశ పూర్తయినట్లు ఎంఈవో టి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలో 48 మంది టీచర్లు మిగులుగా తేలగా 34మందిని సర్దుబాటు చేశారు. 14 మంది ఎస్‌జీటీలు ఇప్పటికి మిగులుగా ఉన్నారు. రెండు ఇంగ్లీషు, ఒక హిందీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లో ఇతర మండలాల్లో అర్హులైన టీచర్లతో భర్తీచేస్తారని కిషోర్‌బాబు తెలిపారు.

పంచాయతీలకు ఊరట

- జిల్లాకు రూ.70కోట్లు ఆర్థికసంఘం నిధులు
- ఈ నెలాఖరులోపు అకౌంట్లకు జమయ్యే అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 20: గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు ఊరట లభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు రూ.70కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థికసంఘం నిధులను విద్యుత్ బకాయిలు, ఇతర అవసరాల కోసం దుర్వినియోగం చేయడంతో గ్రామపంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. ఫాగింగ్ చేసేందుకు కూడా నిధులు లేక కునారిల్లుతున్న సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిపెట్టింది. పలు పర్యాయాలు కేంద్రప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్థికసంఘం నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన ఆర్థికసంఘం నిధులను మంగళవారం రాష్ట్రప్రభుత్వం పంచాయతీలకు కేటాయించింది. ఆ నిధులు ఈ నెలాఖరులోపు జమ కానున్నాయి. ఈ నిధుల ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు అత్యవసరమైన పనులు చేపట్టేందుకు అవకాశం వచ్చింది.

నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 20: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇచ్చి, ఇరువురిని వీఆర్‌కు పిలిచారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ ఏఆర్. దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. కురిచేడులో పనిచేసిన బి.శ్రీకాంత్‌ను నాగులుప్పలపాడుకు బదిలీ చేశారు. అక్కడ పనచేస్తున్న బి.బ్రహ్మనాయుడును వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న వి.మహేష్‌ను దోర్నాల ఎస్‌ఐగా నియమించారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన బి.సుదర్శన్‌యాదవ్‌ను అర్ధవీడుకు బదిలీ చేస్తు అక్కడ పనిచేస్తున్న ఎం.అనితను వీఆర్‌కు బదిలీ చేశారు. వెలిగండ్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.శివను కురిచేడుకు బదిలీ చేశారు.

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ అవార్డు

ఒంగోలు(విద్య), ఆగస్టు 20 : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును అందజేసింది. జేఎన్‌టీయూ కాకినాడలో ఆ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును క్విస్ ప్రిన్సిపాల్ వై.హనుమంతరావుకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.రామ్మోహన్ రావు, కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం. మురళీధర్‌ల చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. యూనివర్శిటీ అనుబంధంగా కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ పనితీరు కనబర్చినందుకు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 1998లో స్థాపించిన క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమమైన ఎన్‌ఐఆర్‌ఎఫ్(200-300) ర్యాంకింగ్, న్యాక్ ఎ, ఎన్‌బీఏ గుర్తింపు తదితర ప్రమాణాలతో యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో క్విస్ కళాశాల ప్రథమస్థానంలో నిలిచింది. యూనివర్శిటీ వీసీ మురళీకృష్ణ అభినందించారు. అవార్డును అందుకున్న ప్రిన్సిపాల్‌ను స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణచక్రవర్తి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీగాయత్రి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ప్రత్యేకనిధులు కేటాయించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 20: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎంపీ మాగుంట మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు సమస్యలతో పటు పెండింగ్‌లో ఉన్న పలు రకాల అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ అందుకు సంబంధించి నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు.

తురకపాలెం సచివాలయానికి తాళం

- అద్దె చెల్లించాలని యజమాని డిమాండ్
- 20 రోజుల వ్యవధిలో ఇది రెండోసారి

తాళ్లూరు, ఆగస్టు 20: తురకపాలెం సచివాలయం భవనానికి అద్దె చెల్లించాలంటూ మంగళవారం యజమాని తాళం వేశారు. 20రోజుల్లో రెండు పర్యాయాలు తాళంవేసి సచివాలయ సిబ్బంది విధులకు వెళ్లకుండా ఆటంకం కల్గించినా మండలస్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు. అద్దెకు ఉంటున్న సచివాలయానికి రూ.56 వేలు చెల్లించాలని మంగళవారం ఉదయం తాళంవేశారు. దీంతో సిబ్బంది సచివాలయంలోకి వెళ్లలేక నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్ర భవనంలో తలదాల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు అద్దె చెల్లిస్తామని ఎంత చెప్పినా వినకుండా, తమకు అద్దె చెల్లిస్తేనే తాళంతీస్తామని యజమాని పేర్కొన్నారు. అప్పటివరకు సచివాలయ సిబ్బందిని లోనికి వెళ్లనీయబోమని విధులకు ఆటంకం కల్గించారు. ఇదేవిధంగా అద్దెచెల్లించలేదని గతనెల 31 సచివాలయానికి తాళం వేశారు.

అద్దె చెల్లిస్తామన్నా వైసీపీ నేతలు తాళం వేస్తున్నారు

సచివాలయానికి చెల్లించాల్సిన బకాయి నెలలో చెల్లిస్తామనగా, ఇంటి యజమాని ఒప్పుకుని ప్రతిసారి తాళం వేస్తున్నారని సర్పంచ్ సీహెచ్ గురవారెడ్డి పేర్కొన్నారు. ఇంటి యజమాని, వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు కూడా వైసీపీ నాయకులకే వంతపాడుతున్నారన్నారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామప్రత్యేకాధికారుల పాలనలో చెల్లించకుండా బకాయి ఉంటే సర్పంచ్‌గా నేను చెల్లించానన్నారు. చెల్లించాల్సిన బకాయి చెల్లిస్తానన్నా మాట వినకుండా, పిల్ల చేష్టలుగా ఇప్పటికి ఐదుసార్లు తాళం వేయటం జరిగిందన్నారు. అధికారుల పనీతీరు సక్రమంగాలేకనే వైసీపీ నేతలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు.

నూతన సచివాలయం ప్రారంభించినా బిల్లులు రాలేందంటూ ఓ వైసీపీ నాయకుడు సచివాలయ భవన తాళం ఇవ్వలేదని ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారన్నారు. ఈ విషయమై అనేకమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవటంతో సమస్య తీవ్రతరమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.

పక్కాగా పంటల నమోదు చేపట్టాలి

దొనకొండ, ఆగస్టు 20: రైతులు సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పంట నమోదు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని పెద్దన్నపాలెం, గుడిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి మాత్రమే ఈపంట నమోదు చేయాలన్నారు. కౌలుకు సాగు చేస్తున్న రైతులకు సీసీఆర్‌సీ కార్డుల ద్వారా సాగు చేస్తున్న పంటలను నమోదు చేస్తామన్నారు. ఏరోజు, ఏ సర్వే నెంబర్లల్లో పంట నమోదు చేయబోతున్నారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది అరుణాదేవి, వీణకుమారి, రైతులు పాల్గొన్నారు.

ముందు కట్టడి.. తరువాత కాంట్రాక్టు పద్ధతి

- ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు వ్యూహరచన
- దిబ్బలున్న వ్యక్తులతో బేరసారాలు
- పార్టీలతో పనేముంది.. కలిస్తేనే కాసులు
- అందరికీ సంధానకర్తగా వ్యవహరిస్తున్న వ్యక్తి
- తిరిగి దందా పునఃప్రారంభించేందుకు ఒప్పందాలు
- ఉచిత ఇసుక విధానం సాగేనా?



ఇసుక ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు

చీరాల, ఆగస్టు 20 : నాలుగు రోజుల్లో చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను ఒకే గొడుకు కిందకు తెచ్చేందుకు ఓ కీలక వ్యక్తి పావులు కదుపుతున్నాడు. ముందు కట్టడి చేద్దాం..తరువాత కాంట్రాక్టు పద్ధతిలో ముందుకు సాగుదామని చెప్తున్నాడు. ఇసుక దిబ్బలు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎవరి ఆధీనంలో ఎంత ఉన్నాయి. అందులో సొంతమెంత, అసైన్డ్ భూమి ఎంత, పార్టీలతో పనేముంది. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పటి వరకూ మనకు తిరుగుండదని భావిస్తున్నాడు. ప్రస్తుతం సమిష్టిగా ఇసుక దందా సాగించి కాసులు కూడబెట్టుకుందామని ఆ కీలక వ్యక్తి సంపాదించుకుందామంటూ ఆ కీలక వ్యక్తి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి సంబంధీకులతో పార్టీలకు అతీతంగా చర్చలు జరుపుతున్నాడు. నాలుగైదు రోజుల్లో దందాను ఒకే గొడుగు కిందికి తెచ్చి పునఃప్రారంభించేందుకు పావులు కదపడంపై రాజకీయవర్గాలతో పాటు సామాన్య ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో చీరాల నియోజకవర్గంలో అసలు ఉచిత ఇసుక సరఫరా ఉంటుందా లేదా అని చర్చించుకుంటున్నారు.

అసలేం జరుగుతోంది..

216 జాతీయ రహదారి పక్కన వేటపాలెం, పందిళ్ల పల్లి మధ్య భారీ అక్రమ ఇసుక కువ్వలు వైసీపీ హయాంలో ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తెచ్చిన నేపథ్యంలో ఆ ఇసుకను కొనుగోలుదారులకు విక్రయించారు. ఆ ఇసుక అయిపోయిన తరువాత మరలా ఆ నిల్వ కేంద్రానికి సరఫరా లేదు. ఈ క్రమంలో అక్రమ తవ్వకాలు, రవాణా ఊపందుకున్నాయి. ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో ఆగని ఇసుక అక్రమ రవాణా అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఓ ఎక్స్‌కవేటర్ నిర్వాహకుడికి రూ.50వేలు అపరాధ రుసుము విధించారు. చీరాల నియోజకవర్గం ఈపురుపాలెం పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలకు సంబంధించి కొలతలు తీశారు. దీంతో పాటు ఈపురుపాలెంలోని మరో ప్రాంతం లోను, బోయినవారిపాలెం, కావూరివారిపాలెం, చల్లారెడ్డిపాలెం, పాపాయిపాలెం, గవినివారిపాలెం, పందిళ్లపల్లి, పర్చూరు నియోజకవర్గంలో మోటుపల్లి, కడవకుదురు పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలను లెక్కకట్టాల్సి ఉంది.

ఇప్పుడేం జరుగుతోంది..

మైనింగ్, రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కట్టడికి ప్రయత్నం చేస్తున్నారు. వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఇటీవల తాను చార్జి తీసుకున్న తరువాత 5 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందులో ఒకటి మంగళవారం తాజాగా పట్టుకున్నారు. ఇదిలావుంటే కీలకవ్యక్తి ఆచరణలోకి తీసుకొస్తున్న ఒకే గొడుగు కిందికి ఇసుక అక్రమ దందాను ప్రారంభించిన తరువాత కూడా ఇలాగే యంత్రాంగం పట్టుకుంటుందా లేదా వేచ్చి చూడాలి.

పార్టీలతో పనేముంది.. కలిస్తే తలో రూపాయి వస్తుంది

నియోజవకర్గంలో ఇసుక అక్రమ దందాను కలసి చేసుకుందాం. అలాచేస్తే నాలుగు రూపాయలు వస్తాయని ఆ కీలక వ్యక్తి రాయబేరాలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో ఇసుక దిబ్బలు ఉన్న ఒకరిద్దరు అంగీకారం తెలపగా, భారీగా ఇసుక దిబ్బలు ఉన్న ఒకరిద్దరు ధర దగ్గర మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది. వారంతా గత ఎన్నికల్లో వైసీపీకి చేసిన వ్యక్తులు కావడంతో కూటమికి చెందినవారు ఆ అంశాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని బహిరంగంగానే తమ సన్నిహితుల వద్ద అంటున్నారు. అక్రమ ఇసుక దందాను కొనసాగించేందుకు ఆ కీలక వ్యక్తికి మద్దతు లభిస్తుందో.. లేక ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు జరుగుతుందో వేచి చూడాల్సిందే.



నామ్ రోడ్డులో వెలగని సెంట్రల్ లైటింగ్

సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం

అద్దంకి, ఆగస్టు 20 : అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలోని నామ్ రోడ్డులో నల్లవాగు వద్ద నుంచి శింగరకొండ సమీపంలోని అభయాంజనేయస్వామి 99 అడుగుల విగ్రహం వరకు సుమారు 4 కి.మీ. దూరం సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నిర్వహణ కొంత భాగం నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మరి కొంత భాగం అద్దంకి మున్సిపాలిటీ వారు చేస్తున్నారు. దీంతో తరచూ పలు ప్రాంతాలలో లైట్లు వెలగడం లేదు. లైటింగ్ సరిగ్గా లేక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 20 : మినుము పైరులో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో కాశీవిశ్వనాథ్ రైతులకు సూచించారు. మండలంలోని కొత్తపేట-3 రైతు సేవా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న మినుము పైరును పరిశీలించారు. సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో శివనాగబాబు, రైతులు పాల్గొన్నారు.

షర్మిలారాణికి డాక్టరేట్



షర్మిలారాణిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 20: అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలు ఎన్.షర్మిలారాణికి ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్త్రీ రహస్యం, జైశ్రీ మిశ్రా ఎంపిక చేసిన నవలలను అధ్యయనం అంశంపై ఆమె చేసిన పరిశోధనలకు గాను ఏయూ పీహెచ్‌డీతో సత్కరించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ ఎన్. షర్మిలారాణిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

మేదరమెట్ల, ఆగస్టు 20 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో రోడ్డుపక్కగా వెళుతున్న యాచకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో యాచకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహ్మద్ రఫీ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బారికేడ్లను ఢీకొని బైకిస్టు మృతి

మేదరమెట్ల, ఆగస్టు 20 : మేదరమెట్ల నార్కెట్ పల్లి రహదారిలో మేదరమెట్ల పై ఓవర్ వద్ద రోడ్డు మళ్లింపు కోసం పెట్టిన ప్లాస్టిక్ బారిగేట్లను ఢీకొని మోటర్ సైకిలిస్టు మృతి చెందాడు. మంగళవారం వేకువజామునా అద్దంకి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన షేక్ నాగూర్ బాషా మోటర్ సైకిల్‌పై అద్దంకి నుంచి ఒంగోలు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. బొడ్డువానిపాలెం వద్ద రోడ్డు మరమత్తులల్లో బాగంగా మళ్లింపు కోసం పెట్టిన ప్లాస్టింగ్ బారీ గేట్‌లను గుద్దుకుని కింద పడిపోయాడు. మొఖం రోడ్డుకు తగలడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లింపే ప్రమాదానికి కారణం

రోడ్డు మరమత్తుల కోసం గత వారం రోజులగా మళ్లింపు ఏర్పాటు చేసి ఒకే రోడ్డులో రాకపోకలు నిర్వహిస్తున్నారు. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా మళ్లింపు తీసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ సంస్థ మరమ్మతు పనులు వేగంగా చేయకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. మళ్లింపుపట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరిఫ్ హత్య కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్టు

- కారు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, ఆగస్టు 20 : చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన అమీన్ ఆరీఫ్ (18)ను హత్యకు పాల్పడిన వారిలో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే హత్యకు పాల్పడిన ఆరుగురు రిమాండ్ ఖైదీలుగా ఉండగా, స్థానిక పాపరాజుతోటకు చెందిన గరిక మహేంద్ర (ఏ2), రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ(ఏ8)ని అరెస్ట్ చేశారు. డీఎస్పీ జగదీష్ నాయక్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. అలాగే కారును సీజ్ చేసినట్లు చెప్పారు. కారుకు సైడ్ ఇవ్వలేదని ఈనెల 6వ తేదీన ఆరీఫ్‌ను అతి కిరాతకంగా హత్య చేశారని తెలిపారు. వేగవంతంగా చార్జిషీట్ వేసి నిందుతలకు శిక్ష పడేలా చూస్తున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఏఎస్పీ విఠలేశ్వర్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

గేదెను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

గేదె మృతి, యువకుడికి గాయం

వేటపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 20 : ద్విచక్ర వాహనంతో గేదెను ఢీకొట్టడంతో మూగజీవి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి వేటపాలెం జాతీయ రహదారిలో జరిగింది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వేగంగా వెళ్తూ వైజంక్షన్ వద్ద గేదెను ఢీకొట్టారు. గేదె మృతి చెందగా బైకుపై ఉన్న వ్యక్తి కుడి కంటికి గాయమైంది. క్షతగాత్రుడిని 108లో ఏరియా వైద్యశాలకు తరలించారు. వేటపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తెర పురుగు నివారణకు జాగ్రత్తలు



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, ఆగస్టు 20 : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు మొవ్వలో వేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని వెంపరాల గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్నను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎకరాకు 4కేజీలు వేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ-పంటను సెప్టెంబర్ 15 కల్లా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయనవెంట సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకి, ఆగస్టు 20 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9-30 గంటలకు కొమ్మినేనివారిపాలెం, 10 గంటలకు వెంపరాల, 11 గంటలకు చక్రాయపాలెం, 11-30 గంటలకు అద్దంకి పట్టణంలోని 14వ వార్డు, 11-45 గంటలకు 2వ వార్డు, 12 గంటలకు చెరువుకొమ్ముపాలెంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.



సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు, అధ్యాపకులు

యాంటీ ర్యాగింగ్ చట్టాలపై అవగాహన

అద్దంకిటౌన్, ఆగస్టు 20 : విద్యార్థులందరూ యాంటీ ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, అనూషా, బెంజిమెన్ యాంటి ర్యాగింగ్ చట్టాలు, వాటి ద్వారా పడే శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

చినగంజాం, ఆగస్టు 20 : గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చీరాల పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టిబాబు అన్నారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 35 గేదెలకు, ఆవులకు చూడు పరీక్షలు, 27 గేదెలకు సాధారణ వైద్య పరీక్షలను డాక్టర్ చిట్టిబాబు, చినగంజాం పశువైద్యాధికారి బండ్ల కిరణ్ నిర్వహించారు. 25 దూడలకు ఎదుగుదలకు సంబంధించిన మందులను అందజేశారు. గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి పశు పోషకలకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రత్నకుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. రైతులు 18004198800 నెంబరకు ఫోను చేసి సూచనలు, సలహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ విలేజ్ అసిస్టెంట్ టి.ఆదయ్య, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

కోలలపూడిలో జింక కళేబరం



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మార్టూరు, ఆగస్టు 20 : మండల పరిధిలో కోలలపూడి గ్రామ పొలాల్లో దాసరి శ్రీనుకు చెందిన మినప పంటలో చుక్కల దుప్పి (జింక) కళేబరం ఉన్నట్లు మంగళవారం తమకు సమాచారం వచ్చినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే రమేష్ తెలిపారు. ఈ విషయమై సమాచారం అందడంతో ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పొలంలో ఉన్న దుప్పి కళేబరాన్ని పరిశీలించారు. దాదాపుగా 10 రోజుల కిందట కుక్కల దాడిలో దుప్పి చనిపోయినట్లు భావిస్తున్నామని, దుప్పి కళేబరం పూర్తిగా పాడైపోయిందని రమేష్ తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ అశ్వనిని, గ్రామపెద్దలను పిలిపించి, వారి సమక్షంలో కళేబరాన్ని దగ్ధం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



క్యాంటీన్‌లో భోజనం ఒడ్డిస్తున్న కరిముల్లా

అద్దంకి, ఆగస్టు 20 : నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం అన్న క్యాంటీన్‌లో 300 మందికి భోజనాలను సమకూర్చారు. అక్కడ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

- ప్రభుత్వ విద్యకు పూర్వవైభవం తీసుకురావాలి
- మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి



మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు 20 : పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేసి ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. మంగలవారం రాష్ట్ర సచివాలయంలో ఎమ్మెల్యే ఏలూరి విద్యా శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. జగన్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ అంధకారంలో పడిందని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస అవసరాలను కూడా వైసీపీ పాలకులు ఏర్పాటు చేయలేదన్నారు తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో కోట్లాదిరూపాయలు ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేకుండా నిర్లక్ష్య వైఖరిని అనుసరించిందన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని ఏలూరి మంత్రిని కోరారు. మార్టూరు మండలంలో 3, యద్దనపూడి మండలంలో 1 ఎయిడెడ్ పాఠశాలల్లో మరుగుదొడ్లతో పాటు కనీస వసతులు కూడా లేవని ఆయా పాఠశాలల్లో వెంటనే వసతులను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. యద్దనపూడి, మార్టూరు, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో జడ్పీ, ప్రాథమిక, హైస్కూళ్లలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు విషసర్పాలకు భయపడుతున్నారని తెలిపారు. వర్షాకాలం సీజను ప్రారంభం కావడంతో కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు వర్షపు నీటితో నిండిపోతున్నాయని, తక్షణమే వాటికి మరమ్మలు చేయించాలని మంత్రిని కోరారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. దానికి స్పందించిన మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చినగంజాం, ఆగస్టు 20 : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్ అన్నారు. ప్రపంచ దోమల నియంత్రణ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చినగంజాం గ్రామంలోని ప్రధాన వీధులలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దోమలు ఉత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించాలని, ఆరోగ్యవంతమైన సమాజానికి శ్రీకారం చుట్టాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలన్నారు. మలేరియా, డెంగ్యూతోపాటు దోమలతో వచ్చే వా య ం ద ం ల ం ద రి చే ర వ న్నా రు. దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో చీరాల సబ్‌యూనిట్ అధికారి వి.శ్రీనివాసరావు, సీహెచ్‌వో రూస్సీరాణి, సూపర్‌వైజర్లు ఎం.చిరంజీవి, ఉల్దారాణి, పీహెచ్ఎన్ బేబీ, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరరావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి జంగమహేశ్వరపురం ఎస్టేట్ భూములపై సర్వే

మార్టూరు, ఆగస్టు 20 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని జంగమహేశ్వరపురం ఎస్టేట్ భూములపై ఈనెల 22,23,24 తేదీల్లో ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తామని వలపర్ల వీఆర్వో అశోక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జంగమహేశ్వరపురం పరిధిలో 2521 ఎకరాల ఎస్టేట్ భూములు ఉన్నాయన్నారు. రామకూరు, కొమ్మినేనివారిపాలెం, వలపర్ల, వల్లాపల్లి, ధర్మవరం గ్రామాలకు చెందిన రైతులు ఏళ్లుగా సాగు చేస్తున్నట్లు చెప్పారు. వారికి ఈ భూములలో యాజమాన్య హక్కు నిర్ధారణ కోసం సర్వే చేసేందుకు 8 ప్రత్యేక బృందాలను కేటాయించినట్లు తెలిపారు. ఆయా తేదీల్లో రైతులు అందుబాటులో ఉండి, అధికారులకు సహకరించాలని కోరారు.

కేశఖండనశాల ప్రారంభం



ప్రారంభిస్తున్న ఈవో సుభద్ర, దాతలు

అద్దంకి, ఆగస్టు 20 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన కేశ ఖండనశాలను మంగళవారం ప్రారంభించారు. కావలికి చెందిన నర్రా విజయభాస్కర్ సూరత్‌లో శ్రీభాస్కర్ టెక్స్‌టైల్స్ క్లాత్ ఏజెన్సీస్ నిర్వహిస్తూ స్థిరపడ్డారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద రూ.17లక్షలలో కేశఖండనశాల నిర్మించారు. ఈవో సుభద్ర, దాతలు నర్రా విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు మంగళవారం కేశఖండన శాలను ప్రారంభించారు.

ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్



ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

వాడరేవు(చీరాలటౌన్), ఆగస్టు 20 : విద్యార్థి దశలో ఎన్‌సీసీతో శిక్షణ పొందినవారికి బంగారు భవిష్యత్ ఉంటుందని మేజర్‌లు అంజిరెడ్డి సుబేదార్, రేఖాసింగ్ అన్నారు. చీరాల మండలం వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించా రు. అలాగే సంబంధిత జెండా ఆవిష్కరణ చేశారు. అధికారులు మాట్లాడుతూ ఎన్‌సీసీతో లక్ష్యాలపై మక్కువ పెరుగుతుందన్నారు. క్రమ శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రమేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ రామ్‌నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అనిల్, శ్రేణులు

చీరాల, ఆగస్టు 20 : కోల్‌కతా ఘటనకు కారుకులైన నిందితులను వెంటనే శిక్షించాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కమిటీ కన్వీనర్ ఆల అనిల్ అన్నారు. గడియార స్తంభం సెంటర్లో మంగళవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత ఆల అనిల్ తదితరులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎవరూ అలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో మంగళవారం పలు కళాశాలల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా సభ్యురాలు భవాని, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాశిన మణికుమార్, కాకర్ల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వేముల వెంకటేష్ పాల్గొన్నారు.

పర్చూరు : కోల్‌కతాలో హత్యాచారానికి పాల్పడిన మృగాళ్లను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పర్చూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పెట్రోలు బంక్ నుంచి బొమ్మల సెంటర్ వరకు సాగిన ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్, పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు విన్నకోట అజయ్, నాయకులు కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్రబాబు, సాకిరి శ్రీనివాసరావు, అయ్యప్ప, శీలం కుమార్, బోగాది మోహన్, తోట మణి, రంగిశెట్టి ఆంజనేయులు, అచ్చికోలు సతీష్, తులసి చంటి, గ్రంధి రాజా, సుచంద్, కె.బసవేశ్వరావు, టి.వెంకటేష్ పాల్గొన్నారు.



పర్చూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు